
# ఇదిమాత్రం నిజం!

జి. భారతి



"నవ్వేం బాధపడకు తల్లీ, అమ్మ సంగతి నీకు తెలియదూ పట్టి తొందరమనిషి.' ఓదార్పుగా కూతురి తల నిమిరారు రంగనాధంగారు.

'అమ్మ తొందరమనిషి కాదు నాన్నా, నేను... దురదృష్టవంతురాల్ని. అందుకే...' తండ్రి గుండెలమీద తలవాల్చి బావురుమంది జానకి.

ముడుతలు పడ్డ రంగనాధంగారి ముఖంలో ఖిన్నహాసం మెరిసింది. కూతురివంక జాలిగా చూస్తూ. 'ఏం చేద్దాం తల్లీ, బాహ్యాడంబరాలకే గాని మనిషి వ్యక్తిత్వానికి విలువ నిచ్చేంతగా పెరగలేదమ్మా మన సమాజం...' అని నిట్టూర్చి

సరే పద, అన్నం తిందాం అంటూ లేచారు. వడిలిపోయిన ముఖంతో ఆయన్ను అనుసరించింది జానకి.

అతి సున్నితమైన హృదయాన్ని, ఉన్నత సంస్కారం యిచ్చిన భగవంతుడు జానకికి పెద్ద లోపం చేశాడు. ఈ కాలపు మనుషుల్ని, ముఖ్యంగా యువకుల్ని ఆకర్షించే రూపం లేక పోవడమే ఆ లోపం. అది చాలదన్నట్లు పాదం కొంచెం వంకర...

ఈ లోపాలన్నిటిని మించిన పెద్దలోటు ఏమిటంటే ఆమె కలవారి బిడ్డ కాకపోవడం... ఈ రోజుల్లో డబ్బనె పదార్థం వుంటే ఎలాంటి అమ్మాయయిన అప్సరస అనిపించుకుంటుంది. రంగనాధంగారు యీ సత్యం తెలియని వాడుకాకపోయినా ప్రయత్నాలు తప్పవుగా మరి.

ఇప్పటికి అరడజను మందికి పైగా అబ్బాయిలు జానకిని చూసివెళ్ళినా ఒక్కరికి జానకి నచ్చలేదు. (వీరందరూ మన్మధులేనని మీరను కుంటే పొరపాటు పడ్డట్టే) రంగనాధం గారు ఇంకో ఐదారువేలు ఎక్కువిస్తానంటే నిరభ్యంతరంగా నచ్చేది. కానీ కట్నరూపంలో లోపాలన్ని కప్పిపుచ్చగల తాహతు ఆయనకు లేదు.

ఈ మధ్య పది పదిహేను రోజుల క్రితం ఒక పెళ్ళికొడుకు వచ్చి జానకిని చూసి వెళ్ళాడు. కొండంత ఆశతో ఎదురుచూస్తున్న రంగనాధం గారు యీరోజే వాళ్ళ వద్దనుండి జాబు అందుకున్నారు.

"మీ తమ్ముడు రాశాడు... మొన్న వచ్చిన అబ్బాయికి జానకి నచ్చలేదుట." ఆ జాబులోని సారాంశం క్లుప్తంగా భార్యకు వినిపించి కుర్చీలో వెనక్కి వాలారు.

భర్తచేతిలో కవరుచూసి ఎంతో ఆశతో బయటకు వచ్చిన కాంతమ్మ ముఖం వాడిపోయింది. ఒక్క నిట్టూర్పుతో లోపలికి వెళ్ళబోతూ అక్కడే వెల్లవేసినట్టున్న ముఖంతో నిలబడి వున్న జానకికేసి చూసింది.

అసలే ఏదో తప్పుచేసినట్టు క్రుంగి పోతున్న జానకి మనసుకు తల్లి ముఖంలో సానుభూతికి బదులు అసహ్యం, నిరసన గోచరించాయి. పూరేకులా సున్నితమైన ఆమె హృదయం ఆ భావోద్వేగానికి తట్టుకోలేకపోయింది. కళ్ళనిండా నీళ్ళు నింపుకొని లోపలికి పరుగెత్తి మంచంమీద వాలిపోయింది.

"అమ్మా! నీవుకూడా నేనంటే అసహ్యమేనా? నేనేం తప్పుచేశానని. పుట్టుకతోనే భగవంతుడు పెట్టిన లోపాలకు నేను బాధ్యురాలినా? మీరు కట్నం యివ్వలేకపోతే అది నా తప్పా? కన్న వాళ్ళు మీరే యిలా నిరసిస్తే పరాయివాళ్ళు చూస్తూ చూస్తూ నాలాంటి అవిటిదాన్ని. అందవికారపుదాన్ని జీవితాంతం భరించటానికెలా వప్పుకుంటారమ్మా? పోనీ, నేనేమైనా మిమ్మల్ని పెళ్ళి

చేయమని వేధించానా? పోనీ కొంచెమైనా కన్నెరి చానా. నా మనసు తెలిసికూడా నన్నెందు కిలా బాధపెడతారమ్మా..."

జవాబు దొరకని ఎన్నో ప్రశ్నలు ఆమె మస్తిష్కంలో తుఫానులా చెలరేగాయి. చిన్న తిరస్కారాన్నికూడా భరించలేని ఆమె సున్నిత హృదయం చిగురాకులా కంపించిపోయింది.

"ఈ సంబంధమయినా కుదురుతుందని ఎంతో ఆశ పెట్టుకున్నాను. ప్చ్... దానికింక పెళ్ళియోగం లేదులావుంది" వంట యింట్లో మాట్లాడుతున్న తల్లి కంఠంలో నిరాశ స్పష్టంగా కనిపించింది జానకికి.

"ఇంక వూరుకో. దానికేం, పువ్వులాంటి మనసు, దాన్ని చేసుకునే వాడెవడో అదృష్టవంతుడు తెలుసా... ఎప్పుడో వీళ్ళందర్నీ తలదన్నేవాడు, సంస్కారవంతుడు కావాలని వచ్చి చేసుకుంటాడు చూడు" రంగనాథంగారి గొంతులో ఏదో నమ్మకం, ఆశ...

"ఆఁ... ఆఁ... అలాగే ఎదురు చూస్తూ వుండండి తండ్రీ కూతుళ్ళు పాపం... ఈ అప్సరసను చూసి వెతుక్కుంటూ వస్తారు..."

తల్లి కంఠం విని వులిక్కిపడింది జానకి. ఆ హేళనకు ఆమె మనసు గాయపడింది. అంతలోనే సర్దుకుని "అవును అమ్మ అన్న మాటలో తప్పేముందీ, కళ్ళకు కట్టినట్లు కన్పిస్తున్న యీ సత్యాన్ని విని బాధపడడం దేనికి?" అనుకుంది.

అమ్మా, నాన్నా తను పుట్టినప్పటినుండి ఎంత బాధపడిపోతున్నారో... అమ్మ మరీ. యీ మధ్య ఆమె ముఖంలో సంతోషపు ఛాయలే కన్పించటం లేదు. ఎప్పుడూ ఏదో ఆలోచన... బెంగ ఆమె ఆందోళన అంతా తన భవిష్యత్తుగురించేనని అర్థం చేసుకోలేని అవివేకురాలు కాదు తను. పదిమందిలోకి వెళ్ళాలంటే ఏదో, చిన్నతనం, భయం అందుకే పేరంటానికి కూడా వెళ్ళడం మానేసింది. అవునుమరి.

"ఆ నల్లగా కొంచెం కాలు అవిటి... వీళ్ళమ్మాయే కదూ... యింకా పెళ్ళికాలేదు" అంటూ ఎన్నిసార్లు చెప్పుకున్నా తనివితీరనట్లు తెలిసిన వాళ్ళు కూడా కనిపించినప్పుడిలా చెప్పుకుంటూంటే తల్లి మనసు ఎంతగా కుంగిపోయిందో...

ఇక నాన్న... ఆయన పైకి ఎంత నిబ్బరంగా నిర్వికారంగా కన్పించినా ఆయన మనసులో వున్న ఆలోచనలు తనకు తెలుసు... ఒక్కొక్కసారి ఆయన ముఖం చూస్తుంటే అంతగా ఆయనను క్షోభ పెడుతున్నందుకు తనమీద తనకే ఎంతో కోపం వచ్చేది.

జానకికి తన జీవితంమీద విరక్తి, అసహ్యం పెరగసాగాయి.

"ఛీఛీ... ఎందుకొచ్చిన బ్రతుకు... తన వల్లనే ఆ కుటుంబంలో సుఖశాంతులు లేకుండాపోయాయి. తనవల్ల ఎవరికీ సుఖం లేకపోగా అందరికీ బాధ, ఆందోళన.

జానకి మనసులో ఆలోచనలు అలలు అలలుగా లేస్తున్నాయి. గుర్తు తెలిసినప్పటినుండీ జరిగిన పతి సంఘటనా, ప్రతి వ్యక్తి తనను చూసి నవ్వు తున్నట్లు, హేళన చేస్తున్నట్లు అనిపించసాగింది.

ఎవరైనా యింటికి వస్తే "ఇది మా పెద్దమ్మాయి" అంటూ తనను చూపుతున్న తల్లి ముఖంలో ఏదో నేరంచేసిన భావం... బజారులో తనపక్కన నడుస్తున్న చెల్లెలు సరళ ఎవరైనా తెలిసినవాళ్ళు కన్పిస్తారేమోనన్న భయంతో ఒదిగి ఒదిగి తనకు దూరంగా నడుస్తున్నట్లు ఊహించుకో సాగింది.

"సరళకూడా నన్ను అసహ్యించుకుంటోందా" ఆ ఊహకే తల్లడిల్లిపోయింది జానకి మనసు.

'అవును. సరళ పెళ్ళికి తను పెద్ద ప్రతిబంధకం కాదూ,

తనకు సంబంధాలు చూడడంతోనే సరళ పెళ్ళీడుకూడా దాటిపోయేట్టు వుంది.

తను అడ్డు లేకపోతే దానికేం, బంగారుబొమ్మ. ఎవరైనా కళ్ళకద్దుకుని చేసుకుంటారు. ఇప్పుడు బోలెడు ప్రశ్నలు.

"ఇంతకంటే పెద్దమ్మాయి వున్నట్టుండిగా, ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదేం, కాకుండానే చెల్లెలికి చేస్తారా?..." అంటూ.

చదువు, అందం, తెలివీ అన్నీ వున్న అమ్మాయిలకే మధ్య తరగతి కుటుంబాలలో పెళ్ళి పెద్ద సమస్య అయిపోయింది. అలాంటిది తనలాంటి అమ్మాయి పెళ్ళి అవుతుందని ఆశించడం, ప్రయత్నించడం ఎంత అవివేకం...

పెళ్ళికాకుండా జీవితాంతం వుండవలసి వచ్చినా తనేం బాధపడదు. మరి సరళ.. తన పెళ్ళి కాకుండా సరళ పెళ్ళి కావాలంటే చాలా కష్టం? నిజం చెప్పాలంటే 'పెళ్ళి పదం వుచ్చరించటానికైనా అర్హతలేదు తనకు...

అదుపు లేకుండా సాగిపోతున్నాయి జానకి ఆలోచనలు... యిన్ని అవమానాలు భరిస్తూ యిన్నాళ్ళూ ఎలా బతికానా అన్న ఆశ్చర్యం కల్గసాగింది.

రోడ్డుమీద నడిచిపోతుంటే ఎన్నివ్యాఖ్యానాలు?

"అబ్బ ఆ నడక చూడరా... డాన్సులావుంది." అంటూ డిగ్రీలు తెచ్చుకొన్నా సంస్కారం ఏ కోశానా లేని యువకులు గొల్లుమని నవ్వుతుంటే, "భగవాన్... నాకెందుకీ శిక్ష." అని ఎన్నిసార్లు కృంగిపోలేదు తను. అలా తాను బాధపడిన సంఘటనలు చాలా వున్నాయి. ఏం లాభం. ఏం చేయగలదు తను.

జానకి తల ఆలోచనలతో వేడెక్కిపోయింది. ఇన్నాళ్ళూ తను కల్పించిన సమస్యలు, ఇక రాబోయే సమస్యలు కళ్ళకు కట్టినట్లు కన్పించసాగాయి. అసలు తన జీవితమే పెద్ద సమస్య.

ఆ సమస్యలకు పరిష్కారం కనిపెట్టందే ఆమె ఊహలకు విశ్రాంతి లేనట్టుంది.

అలసట లేకుండా ఆలోచిస్తున్న జానకి మెదడులో ఒక్క మెరుపు మెరిసినట్లైంది. అవును... అలా చేస్తే... తనని వేధిస్తున్న సమస్యలన్నింటికీ అంతకు మించిన పరిష్కారం లేదు.

అమ్మా నాన్నా, తాత్కాలికంగా బాధపడినా క్రమంగా వాళ్ళే మరిచిపోతారు. దీనివల్ల, యీ పనివల్ల ఎవరికీ నష్టం వుండదు.

జానకి ఆలోచనలు మరో దారి పట్టాయి.

అవమానాలతో, ఆలోచనలతో అలసిపోయిన ఆమె హృదయం సూటిగా ఆలోచించటం మరిచిపోయింది. కన్నవాళ్ళ మనసుల్ని కూడా అర్థం చేసుకోలేకపోయింది.

అనుభవశూన్యమైన మనసుతో, ఆవేశంతో, తను చేయబోయే పని, తీసుకున్న నిర్ణయం ఎలా పరిణమిస్తుందో, ఎన్ని హృదయాలను క్షోభ పెడుతుందో, అర్థం చేసుకునే శక్తికోల్పోయింది.

ఆ రాత్రి ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు కన్పించే జానకి చిన్నపిల్లలా గంతులు వేస్తూ, ఉత్సాహంగా కబురు చెప్తుంటే, యింట్లోవాళ్ళంతా ఆశ్చర్యంలో మునిగిపోయారు.

జానకిబరువంతా దింపుకొన్నట్లు చాలారోజుల తర్వాత ఎంతో హాయిగా నిద్రించింది.

* * *

'ఇదుగో యిలారా. నే చెప్పలేదూ జానకి అదృష్టవంతురాలని ...... తీసి పారేశావుగా నా మాటలు...' రంగనాథంగారు భార్యను కేకేశారు..

'ఏమిటండీ...హడావిడి..' అంటూ బయటకు వచ్చింది శాంతమ్మ.

"చూడు" విజయగర్వంతో భార్య ముఖంలోకి చూస్తూ కాగితం అందించారు రంగనాథంగారు.

"పూజ్యులైన మామయ్యకు,

ఇక్కడ అంతా క్షేమం. మీరు జానకికి సంబంధాలు చూస్తున్నామని, యింకా ఏదీ కుదర లేదని నాన్నగారికి వ్రాసిన జాబు అందినది. మీరేమీ అనుకోకపోతే ఒక విషయం. మీకు, జానకికి ఏమీ అభ్యంతరం లేకపోతే జానకిని నేను చేసుకుంటాను. అమ్మా నాన్నలకు కూడా యిష్టమే. ఇలా వ్రాసినందుకు క్షమిస్తారను కుంటాను.

— రామకృష్ణ."

శాంతమ్మ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. జానకి యింత అదృష్టవంతురాలని, యిలాంటి భర్త దొరుకుతాడని కలలో కూడా వూహించలేదు తాము రామకృష్ణ ఎంత సంస్కారవంతుడు... కూతురి భాగ్యానికి పొంగిపోతూ చేష్టలుడిగి నిలబడిపోయింది శాంతమ్మ.

అప్పుడే అక్కడికి వచ్చిన సరళ తల్లి ముఖంలోని ఆనందానికి అర్థం తెలియక చేతిలోనుండి ఉత్తరం తీసుకుని ఒక్క వూపులో చదివేసి సంతోషంతో అక్కదగ్గరకు పరుగెత్తింది...

దగ్గరగా వేసివున్న గది తలుపుల్ని తోసి లోపలికి అడుగుపెట్టిన సరళ కెవ్వున కేక వేసింది.

మంచం పక్కనేవున్న టేబిల్ మీద మూత తీసేసి ఖాళీగా వున్న నిద్రమాత్రల సీసా... మంచంమీద సుదీర్ఘ నిద్రపోతున్న జానకి. పరిస్థితిని తెలియచేస్తున్నాయి.

టేబుల్ మీద బరువుపెట్టి వున్న కాగితం రెపరెపలాడుతూ తన వునికిని గుర్తించమంటున్నది.

ఈ లోకంలోకి వచ్చిన సరళ కంపిస్తున్న

(మిగతా 56వ పేజీలో)

# అపమర్థుడు

(16 వ పేజీ తరువాయి)

"నేను మీకు జ్ఞాపక మున్నానను కుంటాను" అన్నాడు వ్యంగ్యధోరణిలో.

"పిలిపించిన కారణం?" సూటిగా అడిగాడు. దామోదరం ఎలా మొదలు పెట్టాలో తోచక తికమక పడ్డాడు.

"మీ పత్రికను చూశాను చాలా బ్రహ్మాండంగా రాస్తున్నారు. కాని రాసేముందు మమ్మల్ని సంప్రదించ నక్కరలేదా" అంటూ ఓ పొడిదగ్గు దగ్గి "అడిగితే మామూలు ముట్టజెప్పే వాణ్ణిగా" అన్నాడు వోరకంట చూస్తూ.

తాఱాజువ్వలా లేచాడు రాజశేఖరం. "క్షమించండి డబ్బు కక్కుర్తి మనిషినిగాను నేను. సంఘంలోని అక్రమాలను వాటిని సృష్టించే మానవులను పరిదిద్దాలని కంకణం కట్టుకున్నాను." అంటూ తన లక్ష్యాన్ని వివరించాడు.

దామోదరం మారు మాట్లాడకుండా డ్రాయరు తెరిచి రెండువేల రూపాయల నోట్లకట్టలు తీసి టేబిల్‌పైన పెట్టాడు. తరువాత రాజశేఖరాన్ని వోరకంట చూస్తూ "చూడండి. ఇది ప్రపంచం. డబ్బుతోగాని పనులు జరుగవు." అంటూ ఆగి "ఇవి రెండువేల రూపాయలు. మీరు వొకప్పుడు ఈ డబ్బుకోసమే నా వద్దకు ఉద్యోగార్థులై వచ్చారు." అంటూ తన అభిప్రాయాన్ని పరోక్షంగా తెలియజేశాడు. "క్షమించండి" అని నిరాకరించాడు రాజశేఖరం.

దామోదరం ఉగ్రుడయ్యాడు. "మిస్టర్, నేను తలచుకుంటే ఏమైనా చేయగలను. నిన్ను బ్రతిమాల నవసరంలేదు. మర్యాదగా చెబుతున్నాను. ఈ డబ్బును తీసుకొని పేపర్లో నా గురించి రాసినదంతా అబద్ధమని సవరణ వేయించండి" అన్నాడు.

"వీలుపడదు" అంటూ లేచాడు రాజశేఖరం, కోపంగా.

దామోదరం కూడా విసురుగా లేచాడు. "నీ నిర్ణయం అదేనా, రేపు ఉదయం నీ పేపరు మూతపడుతుంది. నీవు మళ్ళీ నిరాశ్రయుడవౌతావు" అన్నాడు

రాజశేఖరం బైటికిపోతూ ఓ సారి దామోదరాన్ని ఏహ్యభావంతో చూచి "మిస్టర్ దామోదరం! నీకు డబ్బుంది. అందుచేత నీవు పేపరునే గాదు, వీలుంటే ప్రాణాలనుగూడా తీయగలగడంలో సమర్థుడవే కావినేను మాత్రం నా లక్ష్యాన్ని వదలను."

ఆ మర్నాడు, ఎడిటర్, రాజశేఖరం వద్దకు వచ్చాడు. "మిస్టర్ శేఖర్! న్యాయానికి స్థానం లేదు. పేపరు ఆఫీసుకు సీలు వేశారు" అన్నాడు.

రాజశేఖరం చిన్నగా నవ్వాడు తనకున్న ఒకే ఒక ఆస్థి చేతిసంచీ తీసుకొని తిరిగి బజార్ల వెంట పడ్డాడు. ★

# ఇదిమాత్రం నిజం

(52 వ పేజీ తరువాయి)

చేతులతో కాగితం తీసింది. అస్తవ్యస్తంగా వున్న అక్షరాలు ఆమెకళ్ళముందు అలుక్కుపోతున్నాయి. అతి ప్రయత్నంమీద చదివింది...

అమ్మా నాన్నలకు,

నమస్కారాలు. మిమ్మల్నిలా బాధపెడుతున్నందుకు క్షమించమని అడుగుతున్నాను. మీరు పడినమనోవ్యథముందు యిదేమంత పెద్దదికాదనుకుంటాను. మీరంతా పైకి నన్నేమీ అనకపోయినా మనసులో ఎంతఅసహ్యించుకొంటున్నారో నిన్ననే అమ్మ ప్రవర్తన వల్ల తెలిసింది. కన్నవాళ్ళకు కూడాయింత బరువై పోయాక యింక బ్రతకటంతో అర్థం కన్పించటల్లేదు నాకు, అందుకే యీ సాహసం చేస్తున్నాను...

నా అడ్డు లేకపోతే సరళ పెళ్ళికి బాధపడ నక్కరలేదు మీరు, మంచి సంబంధం చూసి సరళ పెళ్ళి చేసేయండి...

అమ్మా నాన్నల అదరణకు కూడా నోచుకోని అభాగ్యురాలు.

— జానకి

'ఎంత తొందర పడ్డావ్ తల్లీ, ఎంత అపార్థం చేసుకున్నావమ్మా, పోనీ, ఒక్కరోజు ఆలోచించ లేకపోయావా...' రంగనాథంగారి కంఠం గద్గదమైంది ......

'పాపిష్టిదాన్ని...నా మాటలకే తొందరపాటుకే బలయి పోయావు తల్లీ...నీ మనసెంత బాధపడితే యింతపని చేశావో...' కన్నతల్లి ఆవేదన ...

'నా పెళ్ళికి అడ్డుగా వున్నావని ఎప్పుడైనా అన్నానా అక్కా, అసలా భావనే నాకు రాలేదే..!' చేయని తప్పుకు పశ్చాత్తాప పడుతున్న సరళ...

ఒక్కరోజు తేడాలో విలువలన్నీ తారుమారయిన రామకృష్ణబాబు అతని నిర్ణయం లాగే ఎందుకూ కొరగాకుండా కాంతమ్మగారి చేతిలో నలిగిపోతూంది.

శుష్క విలువలకు ప్రాధాన్యత నిచ్చే సంకుచిత సమాజానికి, అర్థంలేని ఆవేశానికి బలైపోయింది జానకి జీవితం.

ఏమైనా ఒకటిమాత్రం నిజం...

భగవంతుడు జానకి హృదయంలోని సౌందర్యాన్ని రూపంలో వుంచి, ఆమె శరీరంలోని వైకల్యాన్ని మనసులో వుంచినా ఆమె యింత ఘోరశిక్ష విధించుకోవలసి వచ్చేదికాదు. దేవుడు వరంగా యిచ్చిన సున్నితహృదయమూ, సంస్కారమే ఆమె పాలిటి శాపాలుగా పరిణమించాయి.

★

# నీవు-నీచుట్టూ ప్రపంచం

(14 వ పేజీ తరువాయి)

తాము సమ్మెను యింక కొనసాగించలేమంటున్నారు. ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రారంభమైన పోరాటాన్ని, ప్రత్యేకాంధ్ర కొరకు నిరవధిక పోరాటంగా, రాజకీయ సమ్మెగా మార్చినందుకు నాయకులను ఖండించుతున్నారు. తమ పేరుతో నిధులు ప్రోగుచేస్తున్నప్పటికి తమకు సాయం అందడం లేదని గోలపెడుతున్నారు.

ఆంధ్రసేన తదితర సేనల ధోరణి పాత నాయకులకు, పార్టీలకు, అతీతంగా తయారయింది. రాబోయే రాష్ట్రంలో ప్రధానంగా అధికారం తమకే దత్తం కావాలంటున్నారు. ఇదంతా లక్ష్యశుద్ధి లేదనీ, వుద్యమాన్ని ఏకముఖంగా నడిపించగల నాయకత్వం లోపించిందనీ ద్యోతకం చేస్తున్నది.

ఐతే పార్లమెంటులో ప్రతిప శక్తులన్నీ కలి వేర్పాటు వుద్యమాన్ని బలపరచడంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన భూసంస్కరణలు, పట్టణ ఆస్తుల పరిమితి వగైరా సామాజిక - ఆర్థిక మార్పులను వ్యతిరేకించడమే వారి లక్ష్యమని తే తెల్లమవుతుంది. అందుచేత కార్మికులు, బీ రైతాంగం, వ్యవసాయకూలీలు వగైరా పీడి ప్రజలంతా వేర్పాటువాదుల అరాచక చర్యలన అరికట్టేందుకు, కృషి చేయవలసి వుంది. ప్రగ శీలురైన తీవ్రవాదులందరి తక్షణ కర్తవ్య కూడ అదే!

★



Printed and Published on behalf of Naveenandhra Printing, Industrial and Agricultural Company (P) Ltd. by M. Nagabhushanam, at Swatantra Art Printers, Vijayawada-4. Editor - M. Chandhrasekhara Rao. Cover page printed at Jupiter Lithos, Vijayawada-7. Regd. No. H. 958.